ప్రజాశక్తి
సోమవారం 23 డిసెంబర్ 2024
5
విజయనగరం

పర్యాటక సంస్థ డివిజనల్ మేనేజర్‌గా జగదీష్

ప్రజాశక్తి-విజయనగరం

పర్యాటక అభివృద్ధి సంస్థ విశాఖ ప్రాంతీయ డివిజనల్ మేనేజర్‌గా విభిన్న ప్రతిభా వంతులు, సీనియర్ సిటిజన్ల శాఖ ఎడి జి.వి.బి.జగదీష్ నియమితులయ్యారు. పర్యాటక అభివృద్ధి సంస్థకు సంబంధించి ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించనున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులుగా ఆయన జిల్లాలో అందించిన సేవలకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సహకారంతో మెగా శిబిరాలు నిర్వహించారు. జిల్లాలో ఒకేసారి 2,338 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.3.25 కోట్లు విలువ చేసే బ్యాటరీతో నడిచే మోటార్ సైకిళ్లు, ఇతర ఉపకరణాలను రాష్ట్రంలోనే మొదటి సారిగా అందించారు. దీంతోపాటు కలెక్టరేట్‌లో అందించే వినతులపై వికలాంగులకు వెంటనే ఉపకరణాలు అందజేసి వారి సమస్యల పరిష్కారంలో తోడ్పాటు అందించారు.

పంట మునిగింది.. కన్నీరే మిగిలింది

వేంద్రాంలో పొలాల్లో వరికుప్పలను ముంచెత్తిన నీరు

అకాల వర్షం.. వరి పంటపై విరుచుకుపడింది. రైతన్న రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంటపై నీళ్లు చిమ్మింది. కోలుకోలేని దెబ్బతీసింది. తీరని నష్టాన్ని మిగిల్చి, కర్షకుల కంట కన్నీరు పెట్టిస్తోంది. చేతికందొచ్చిన పంట కళ్లెదుటే నీటిపాలు కావడంతో అన్నదాతలు గుండెలు బాదుకుంటున్నారు. వరిచేనంతా తడిసి ముద్దవడం, నీటిలో నానడంతో బోరుమంటున్నారు.

పంటను కాపాడేందుకు పొలంలో నీటిని బకెట్‌తో తోడుతున్న మహిళా రైతు

ముంచెత్తిన కాలువ

ప్రజాశక్తి-భోగాపురం

అల్పపీడనం వల్ల కురిసిన వర్షాలతో భోగాపురం మండలంలోని పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని లింగాల వలస, పోలిపల్లి గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ రెవెన్యూ పరిధిలో సుమారు 80 ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా పైనుంచి వస్తున్న కాలువ నీరు పొలాల్లోకి పొంగి పొర్లడంతో కోసిన వరిచేను నీట మునిగింది. పోలిపల్లి గ్రామానికి జామి రవణ, ఆమె కుమారుడు పొలంలోని నీటిని బకెట్లతో బయటకు తోడి కోసిన వరిచేనును రక్షించే ప్రయత్నం చేశారు. లింగాలవలసకు చెందిన ఎరుబోతు శ్రీను.. గత మంగళవారం పొలంలో నూర్పిడి యంత్రంతో నూర్పుచేసి ధాన్యాన్ని ఇంటికి తెచ్చేలోపు వర్షం ప్రారంభం కావడంతో పొలంలోనే ఉండిపోయాయి. వాటిపై టార్పాలిన్లు కప్పినప్పటికీ కింది భాగంలో ధాన్యం తడిచిపోయి, ఏకంగా మొలకలు వచ్చే శాయి. చాలామంది రైతులు పంట పొలాల్లోని వరిచేనును గట్టుపై వేసి ఆరబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి ఇలా జరగడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.

పైనుంచి వస్తున్న కాలువ నీటితో మునిగిన వరిచేను



గరికిపేటలో నీట మునిగిన వరిచేను

నీటమునిగిన వరిచేను

నెల్లిమర్ల : మండలంలోని గరికిపేట గ్రామంలో వర్షపునీరు చింతలచెరువులో భారీగా చేరింది. దీంతో చెరువు పైనున్న పొలాల్లోకి నీరంతా ప్రవేశించింది. పొలాల్లో ఉన్న వరికుప్పలు, కోసిన వరిచేనంతా నీటమునిగింది. సుమారు 20 ఎకరాల్లో వరిచేను ముంపు బారిన పడింది. దీంతో ధాన్యం రంగు మారి, మొలకెత్తే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పొలం.. చెరువైంది

బొండపల్లి : మండలంలోని వేంద్రాం రెవెన్యూ గ్రామ పరిధిలో వర్షాల కారణంగా సుమారు 20 ఎకరాల్లో వరికుప్పలు నీట మునిగిపోయాయి. మూడో రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో భాగంగా నీటిపారుదల టన్నెళ్లను మట్టితో మూసి వేయడంతో నీరు పొలాల్లో ఉండిపోవడంతో వరికుప్పలు నీట మునిగాయి. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ డి.రాజేశ్వరరావు.. ఆదివారం ముంపు ప్రాంతాలను పరిశీలించి, నష్టనివారణ చర్యలు చేపట్టారు. వెంటనే ఇరిగేషన్ ఎఇ సూరీడు, సంబంధిత రైల్వే కాంట్రాక్టరుతో మాట్లాడారు. యంత్రాల సహాయంతో యుద్ధప్రాతిపదికన మూడు గంటల్లో టన్నెళ్లను క్లియర్ చేయించారు. ఎగువ నుంచి వచ్చే నీరు రైల్వేలైన్ కింద నుంచి దిగువకు ప్రవహించేలా చర్యలు చేపట్టారు. వరికుప్పలు నీట మునగడంతో రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో నష్టాన్ని అంచనా వేయించారు.

నీటిప్రవాహానికి అడ్డుగా ఉన్న టన్నెళ్ల వద్ద మట్టిని తొలగిస్తున్న పొక్లెయినర్



విద్యుత్తు ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజానీకంతో పాటు దుకాణదారులు కూడా విలవిల్లాడుతున్నారు. ట్రూఅప్ పేరుతో పెనుభారాలు మోపుతూ పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబుకుతోంది. వైసిపి ఓటమికి విద్యుత్తు ఛార్జీలు పెంచడమూ ఓ కారణమే. సాక్షాత్తూ విజయనగరంలో జరిగిన బహిరంగ సభలో ఎనిమిది సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచారని వ్యాఖ్యానించిన టిడిపి అధినేత, ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రెండు సార్లు విద్యుత్తు ఛార్జీల మోతమోగించింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనాల్లో, వ్యాపారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- ట్రూఅప్ దెబ్బతో భారీగా పెరిగిన బిల్లులు
- ఎఫ్‌పిపిసిఎ పేరుతో వడ్డన
- తక్కువ విద్యుత్తు వాడినా.. ఎక్కువ బిల్లు

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్

వాణిజ్యానికి వాయింపు

విజయనగరంలోని ప్రకాశ్ సిల్క్స్ వస్త్ర దుకాణానికి అక్టోబరు నెల విద్యుత్తు వినియోగానికి రూ.26 వేల వరకు బిల్లు వచ్చింది. గత నెల (నవంబర్)లో శీతాకాలం ప్రవేశించడంతో షోరూంలో ఎసిలు వినియోగించలేదు. కానీ, ఇటీవల వచ్చిన బిల్లు చూస్తే, రూ.25,586 వచ్చింది. విద్యుత్తు వినియోగం తగ్గినా, బిల్లు మాత్రం తగ్గలేదు. దీంతో అవాక్కైన షోరూం యజమాని.. బిల్లు చూస్తే విద్యుత్తు వినియోగానికి రూ.19,616 వచ్చింది. మిగతాది అదనపు భారమే. అందులో ట్రూఅప్ ఛార్జీల భారం రూ.2423 పడింది.

ఇది కేవలం ప్రకాశ్ సిల్క్స్ వస్త్ర దుకాణం పరిస్థితే కాదు. నగరంలోని అన్ని వస్త్ర, హోటల్, ఇతర వ్యాపార సంస్థలకు కూడా అధికంగా బిల్లులు రావడంతో వ్యాపారులు ఇదెక్కడి అన్యాయమని వాపోతున్నారు. విద్యుత్తు బిల్లులు చూసి దుకాణదారులు, వస్త్రవ్యాపారులు హడలిపోతున్నారు. అప్పుడు వైసిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమపై విద్యుత్తు భారాలు మోపుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతేడాది వినియోగించిన విద్యుత్తుకు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల భారం మోపింది. డిసెంబర్‌లో ఇస్తున్న బిల్లుల నుంచి ఈ బాదుడు మొదలు పెట్టింది. జనవరిలో అదనంగా మరో ఛార్జీ మోతకు ఇప్పటికే అన్నీ సిద్ధం చేసింది. దీంతో జనానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 9 లక్షలపైగా గృహ, వాణిజ్య విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్తు బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కుతింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జీ, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరుతో ప్రభుత్వం వీరబాదుడు బాదుతోంది. వినియోగించిన కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండా పోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్తు వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్ద మొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరినీ వెంటాడుతోంది. చిరు వ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు.

విద్యుత్తు భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన... ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనే చర్చ జనాల్లో సాగుతోంది. వ్యాపారుల ఆదాయాల్లో మాత్రం పెరుగుదల ఉండటం లేదు. ఒక వైపు వ్యాపారాలే సరిగా సాగని పరిస్థితి నెలకొందని, మరోవైపు విద్యుత్తు ఛార్జీల బాదుడుతో దుకాణాలను, వ్యాపారాలను మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని చెబుతున్నారు. మున్ముందు వ్యాపారాలు కొనసాగించే పరిస్థితి ఉండదని ఆందోళన చెందుతున్నారు.

భారాలు మానుకోవాలి.

వస్త్ర వ్యాపారం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఎక్కువ కరెంటు వాడినా గత నెల రూ.26 వేలు బిల్లు వచ్చింది. తక్కువ కరెంటు వాడినా ఈ నెల దాదాపు అదే బిల్లు వచ్చింది. విద్యుత్తు ఛార్జీలు పెంచి సామాన్యులపై, మా లాంటి చిరు వ్యాపారులపై ప్రభుత్వం భారం వేస్తోంది. ఈ భారాలను వేయడం ప్రభుత్వం మానుకోవాలి.

– పి.రవి, వస్త్ర వ్యాపారి, విజయనగరం

డిసెంబర్‌లో వచ్చిన బిల్లు

నిరసన తెలుపుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ, జిల్లా నాయకులు, కార్మికులు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సబ్బరావమ్మ ● అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కేంద్రమంత్రిగా ఉండి మతోన్మాద, కుల ఉన్మాదంతో కూడిన అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానించడమేనని స్పష్టం చేశారు. అంబేద్కర్ మాట కంటే దేవుడిని స్మరించడం వల్ల పుణ్యం వస్తుందని వ్యాఖ్యానించడమంటే.., అమిత్‌షాకు కుల అహంకారం ఎంత ఉందో అర్థం అవుతుందని మండిపడ్డారు. అమిత షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మనువాద భావజాలం కలిగిన అమిత్‌షా కేంద్రమంత్రిగా పనికిరారన్నారు. తక్షణమే కేంద్రమంత్రి పదవికి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్, టివి రమణ, వి.లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఓటర్ల జాబితా పరిశీలకులు రాక

విజయనగరంకోట : ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఎలక్టోరల్ రోల్ జిల్లా పరిశీలకులు, రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు సోమవారం జిల్లాకు వస్తున్నట్టు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ అధికారులు, జిల్లాకు చెందిన ఎమ్‌పి, ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు.

పోరాట యోధుడు పి.వి.రావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి వర్గీకరణ రద్దు కోసం చివరి శ్వాస వరకు పోరాడిన పోరాటయోధుడు దళితరత్న పి.వి.రావు అని మాల మహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ వెనుక ఉన్న మాలమహానాడు జిల్లా కార్యాలయంలో పివి రావు చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మాలల రిజర్వేషన్లు కాపాడి ఆంధ్రా అంబేద్కర్‌గా పి.వి.రావు పేరు గాంచారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చందక నూకరాజు, జిల్లా కార్యదర్శులు కోరాడ సత్యనారాయణ, దేవాడ సంతోష్ కుమార్, దేబారికి రామారావు, జిల్లా మహిళా అధ్యక్షులు గంధవరపు కుమారి, కార్యదర్శి మైలపల్లి ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ

విద్యారంగ సమస్యలపై విస్తృత పోరాటాలు

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామ్మోహన్
- జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రాము, వెంకటేష్

ప్రజాశక్తి-గజపతినగరం

విద్యారంగ సమస్యలపై విస్తృత పోరాటాలు నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. గజపతినగరంలోని పాల్తేరువారి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ 32వ జిల్లా మహాసభ ఆదివారం ఘనంగా ముగిసింది. రెండో రోజు నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధుల సభలో రామ్మోహన్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీకి కట్టుబడి తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. మహాసభలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు పాల్గొని, సౌహార్ధ సందేశమిచ్చారు.

29 మందితో నూతన జిల్లా కమిటీ

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డి.రాము, సిహెచ్.వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీని 29 మందితో ఎన్నికైంది. జిల్లా ఉపాధ్యక్షులుగా వి.చినబాబు, జె.రవికుమార్, ఎం.వెంకీ, ఎస్.సమీరా, కె.జగదీష్, పి.రమేష్, కె.రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులుగా కె.మణికుమార్, ఆర్.శిరీషా, ఎస్.సోమేశ్, ఇ.వంశీ, కె.రాజు ఎన్నికయ్యారు.



రాము, వెంకటేష్

మహాసభ తీర్మానాలు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ పలు తీర్మానాలు చేసింది. ఈ తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

- నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి.
- సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించి, నిర్మాణం వేగవంతం చేయాలి.
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- ప్రయివేట్ , కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి.
- గర్ల్స్ హాస్టళ్లలో ఉచితంగా శానిటరీ నేప్‌కిన్స్ ఇవ్వాలి.
- సంక్షేమ వసతిగృహాల్లో మెస్ ఛార్జీలు పెంచాలి, మౌలిక సదుపాయాలు కల్పించాలి. హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి.
- హైస్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. స్కూల్ కాంప్లెక్స్ విధానాన్ని రద్దు చేయాలి. మూసేసిన ప్రాథమిక పాఠశాలలను తెరిపించాలి.
- రాజాం, గజపతినగరం, విజయనగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలి.
- విద్యాసంస్థల్లో ఎన్నికలు నిర్వహించాలి.

ఇళ్ల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

- పాత ఇళ్లు పూర్తికి మార్చి 31 తుది గడువు
- పూర్తిచేసిన ఇళ్లకు జనవరిలో తాళం చెవులు పంపిణీ
- లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ కసరత్తు
- ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్‌కు రూ.17 కోట్లు
- 'ప్రజాశక్తి'తో గృహ నిర్మాణ సంస్థ పీడీ కూర్మినాయుడు ముఖాముఖి

ఇళ్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పొన్నాడ కూర్మినాయుడు తెలిపారు. యూనిట్ విలువ రూ.2.50 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు స్పష్టంచేశారు. 2021 తరువాత మంజూరైన (పిఎంఎవై-1.0) ఇళ్లు మార్చి 31 నాటికి పూర్తిచేయాలని, లేదంటే రద్దు అవుతాయని తెలిపారు. ఇప్పటికే 10,200 ఇళ్లను రద్దుచేశామని వివరించారు. ప్రభుత్వం తరపున నిర్మించిన ఇళ్లకు జనవరి మొదటివారంలో తాళం చెవులు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రభుత్వ లే అవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ కసరత్తు చేస్తోందని తెలిపారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్ లబ్ధిదారులకు త్వరలో బిల్లులు అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.17 కోట్లు అవసరం కానున్నట్టు అంచనా వేసి నివేదించామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? జిల్లాలో గృహ నిర్మాణం పరిస్థితి ఎలా ఉంది.?

జిల్లాలో 81,999 ఇళ్లు మంజూరు కాగా, 47 వేల ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన 37 వేల ఇళ్లలో 11,161 ఇళ్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇటువంటి వాటిలో 10,200 ఇళ్లు రద్దయ్యాయి. మిగిలినవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. మార్చి 31లోపు నిర్మాణాలు పూర్తిచేసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత ఈ పథకం పూర్తిగా రద్దవుతుంది. సొంత స్థలాలపై 45,165 ఇళ్లు మంజూరు చేయగా, 35,935 పూర్తయ్యాయి.

? ప్రభుత్వ తక్షణ కర్తవ్యం ఏమిటి?

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం విధించగా, మన జిల్లాలో 4,816 ఇళ్లను పూర్తిచేసేందుకు టార్గెట్ తీసుకున్నాం. ఇందులో 3,272 ఇళ్ల నిర్మాణం (70 శాతం) పూర్తయింది. వీరందరికీ జనవరి మొదటి వారంలో ప్రభుత్వం అప్పగించనుంది. ఇందుకోసం మన జిల్లా నుంచి 200 మంది లబ్ధిదారులను విజయవాడ పంపేందుకు సన్నాహాలు చేస్తున్నాం. వీరందరికీ సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా తాళాలు అందజేయనున్నారు.

? కొత్తగా ఇళ్లు మంజూరు చేస్తారా? యూనిట్ విలువ ఎంత.?

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈసారి (పిఎంఎవై-2.0 కింద) యూనిట్ విలువ రూ.2.50 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. దరఖాస్తుతోపాటు భార్యాభర్తల ఆధార్ కార్డులు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్‌తోపాటు ఫోన్ నంబర్ జత చేయాల్సి ఉంటుంది. అవసరమైన వారంతా సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ లేదా స్థానిక హౌసింగ్ ఎఇలను సంప్రదిస్తే సరిపోతుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1238 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతానికి సంబంధించి 642, పట్టణ ప్రాంతాలకు నుంచి 6,96 దరఖాస్తులు ఉన్నాయి.



? ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్ పరిస్థితి ఏమిటి.?

2019 సంవత్సరానికి ముందు ఎన్‌టిఆర్ హౌసింగ్ స్కీమ్ ఉండేది. ఈ పథకం కింద అప్పట్లో జిల్లా వ్యాప్తంగా 24 వేల ఇళ్లు మంజూరు చేశారు. అదే ఏడాది జూన్ 20 తరువాత బిల్లులు నిలిచిపోవడంతో ఆయా ఇళ్ల నిర్మాణాలన్నీ వివిధ స్థాయిలో ఉండిపోయాయి. వీరందరికీ బిల్లులు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ సూచన మేరకు జిల్లాకు రూ.17 కోట్ల మేర అవసరం కానున్నట్టు అంచనాలు రూపొందించి, ఇప్పటికే నివేదించాం.

? లే అవుట్లలో మౌలిక సదుపాయాల సంగతి ఎలా ఉంది.?

ప్రభుత్వ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. జిల్లాలో 640 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో 46,802 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 8,293 పూర్తయ్యాయి. కాలనీల్లో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, పెండింగ్ బిల్లులు, ఇంకా చేయాల్సిన పనులు తదితరాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు మాతోపాటు రెవెన్యూ, ఎపి ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, పబ్లిక్ హెల్త్, డ్వామా తదితర శాఖల ఆధ్వర్యాన ఇటీవల సర్వే జరిగింది. కలెక్టర్ ద్వారా ఈ నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి పంపనున్నాం.

? పిఎం ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం ఎలా నడుస్తోంది.?

పిఎం ఆవాస్‌యోజన గ్రామీణ్ పథకం కింద జిల్లాలోని కేవలం రాజాం నియోజకవర్గానికి మాత్రమే 302 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 66 ఇళ్లు పూర్తికాగా, 18 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. పునాదుల స్థాయిలో 190, రూఫ్ లెవెల్‌లో 119, స్లాబ్ స్థాయిలో 9 చొప్పున ఉన్నాయి.

? పిఎం జన్‌మన్ ఎంత వరకు వచ్చింది.?

పిఎం జన్‌మన్ పథకం కేవలం ఆదివాసీ గిరిజనుల(పిటిజి)కు మాత్రమే వర్తిస్తుంది. ఈ పథకం కింద 234 ఇళ్లు మంజూరు కాగా, ఒక్కటి కూడా పూర్తికాలేదు. 68 ఇళ్ల నిర్మాణాలు అసలు ప్రారంభమే కాలేదు. 136 ఇళ్లు పునాదుల స్థాయిలో, 3 స్లాబ్ స్థాయిలో ఉన్నాయి.

పార్టీలో చేరిన కార్యకర్తలతో టిడిపి నాయకులు

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పూతికపేట గ్రామానికి చెందిన 25 వైసిపి కుటుంబాలు ఆదివారం టిడిపిలో చేరాయి. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు సమక్షంలో వైసిపి నాయకులు సుంకరి లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ శీల రాములప్పడుతో సహా 25 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఇంచార్జి కర్రోతు బంగార్రాజు వారికి కండువాలు వేసి టిడిపి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని చంద్రబాబుకి మరింత మద్దతు పలకడంలో భాగంగానే పార్టీలో చేరడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, టిడిపి నాయకులు సూర్యనారాయణ, లక్ష్మి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

ప్రజాశక్తి - గరివిడి రూరల్

మండలంలోని తాటిగూడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజం జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు ఎ. సత్యశ్రీనివాసు పూల మాల వేసి నివాళులు అర్పించారు. గణిత మేధావిగా ఆయన కృషిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని జ్ఞాన సముపార్జన చేయాలని విద్యార్థులను కోరారు.

కబడ్డీ పోటీలకు ఉద్యోగి ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు జరజాపుపేటకు చెందిన కాళ్ల శంకరరావు ఎంపికయ్యారు. జనవరి 3, 8 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా వరుసగా జాతీయ స్థాయిలో పాల్గొంటున్న శంకరరావు మొయిద సచివాలయంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ ఎంపికలో పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఆయన్ను ఎమ్మెల్యే పెనుమత్స సురేష్‌బాబు, సచివాలయం పరిధి సర్పంచులు అట్టాడ కృష్ణ, లెంక మంగమ్మ, ఎంపిటిసి పెనుమత్స సంతోష్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్.ఏ.మోహనరావు, జరజాపుపేట గ్రామ పెద్దలు, యువకులు, రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ పెద్దలు అభినందించారు.

రోడ్డు మంజూరు చేయాలని పవన్‌కు వినతి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఎస్.కోట పంచాయతీ పరిధిలో గల రేగ పుణ్యగిరి గ్రామానికి పిఎం జన్మన్ పథకంలో రోడ్డు మంజూరు చేయాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కి వినతి పత్రాన్ని అందించామని జనసేన నాయకుడు వబ్బిన సన్యాసి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతగిరి మండలం పినకోట పంచాయతీ బల్లగరువు గ్రామంలో రోడ్డు శంకుస్థాపన సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని రేగ పుణ్యగిరి గిరిజనులతో కలిసి 3.5 కిలోమీటర్ల రోడ్డుకి రూ.5.30 కోట్లు పిఎం జన్మన్ పథకంలో మంజూరు చేయమని కోరుతూ వినతిని అందించామన్నారు. ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు సూచనల మేరకు పాడి రైతులకు పశువుల షెడ్లు డిజైన్ మార్పులని పాడి రైతులకు ఉపయోగకరంగా ఉండే ప్రత్యామ్నాయ డిజైన్ కూడా పవన్‌కి చూపించి వినతిపత్రం సమర్పించామని సన్యాసి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటవ వార్డు మెంబర్ సీరది అర్జున్, గిరిజనులు కిల్లో సాంబ, సీరది సూరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రామ సభలను సక్రమంగా నిర్వహించాలని ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞపన లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పాలిస్తున్న రాష్ట్రాల శాసనసభలకు శీతాకాల సమావేశాలు ఎలాంటివో గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ బద్ద నాలుగవ గ్రామసభలు అలాంటివని, ఈ గ్రామ సభలో సంవత్సరం మొత్తం మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పైన చర్చిస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి, అధికారులు ఈ గ్రామసభలు సక్రమ నిర్వహణకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు ఎల్. సాంబమూర్తి, సిహెచ్. రామకృష్ణ, ఆర్. సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీలు

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని సాయి శ్రీనివాస ఏజెన్సీస్ పెట్రోల్ బంక్‌ను ఆదివారం జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదన రావు పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎస్‌డిటీలు ఎన్. శంకర రావు, మూర్తి, హెచ్‌పిసిఎల్ సేల్స్ ఆఫీసర్ బి.గగన్, ఈశ్వర్ పెట్రోలు తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించి అనుమతించదగిన పరిధిలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. సేల్స్ ఆఫీసర్ బి. గగన్ మాట్లాడుతూ ట్యాంక్ నుంచి నాజిల్ వద్ద పైప్‌లో ఏమైనా లోపాలు ఉన్నాయా? లేదా ? అనే విషయమై పైప్ లైను పూర్తి స్థాయిలో తనిఖీ చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. అంత వరకు పెట్రోల్ బంక్ విక్రయాలు నిలుపుదల చేయవలసిని ఆదేశించారు. ట్యాంక్, పైపులైన్లలో లీకేజ్ లోపాలు పూర్తి స్థాయిలో పరిష్కారం అయ్యే వరకు బంక్‌లో పెట్రోలియం ఉత్పత్తులు విక్రయాలు ఆపేయాలని చెప్పారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

వర్షాలకు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు రోజులు కురిసిన వర్షాలకు వరికుప్పలు, కళ్లల్లో ఉన్న ధాన్యం తడిసి పోయాయని, తడిసిన ధాన్యాన్ని, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం అవేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ రక్త నిల్వలు లేకపోవడంతో గర్భిణులు, ప్రమాదాలలో గాయపడిన వారు రక్తం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తం నిల్వలు పెంచేందుకు రక్తదాన శిబిరం నిర్వహించామని చెప్పారు. 60మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను ఆయన అభినందించారు.

ఆర్‌టిసి సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆర్‌టిసి సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా రవాణా అధికారి అప్పలనారాయణ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఈ నెల 20వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న డోర్ డెలివరీ ప్రసార మాసోత్సవాలలో భాగంగా ఆర్‌టిసి పార్శిళ్లు, కొరియర్ డోర్ డెలివరీ కోసం స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విజయనగరం, పలాస, బొబ్బిలి, శ్రీకాకుళం, మద్దిలపాలెం, అనకాపల్లితో పాటు నర్సీపట్నంలో కూడా ఈ డోర్ డెలివరీ సదుపాయం కల్పించనున్నామన్నారు. ఆయా పట్టణాలలో 10కి.మీ. పరిధి వరకు డోర్ డెలివరీ చేయనున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎవరైనా 24 గంటలలో పార్శిళ్లుపంపించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ముఖ్య పట్టణాలకు డోర్ డెలివరీ చేస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం డోర్ డెలివరీ మాసోత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి కమర్షియల్ దివ్య, సూపరింటెండెంట్ వెంకట్రావు, సన్యాసిబాబు, ఆర్‌టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం..అపార నష్టం

● ఉసూరుమంటున్న ఉద్యాన రైతులు ● పెసర, మినుము, మొక్క జొన్నకూ తప్పని ముంపు ● లబోదిబోమంటున్న అన్నదాతలు ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

చీపురుపల్లి: నీరు నిల్వ ఉండిపోవడంతో పాడైపోయిన వంగ తోట

అకాల వర్షాలతో ఉద్యాన పంటలు మొక్కజొన్న, వంగ, బొప్పాయితో పాటు అపరాలు పెసర, మినుము పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తమ కల్ల ఎదుటే పండిన పంటలు వర్షార్పణం కావడం చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. గడిచిన ఐదురోజులుగా కురిసిన వర్షాల కారణంగా పంట భూములలో నీరు చేరి పండిన పంటంతా ఇవక పట్టడంతో పూర్తిగా నాశనమయ్యాయి. ఇది చూసి పంటలు పండించే రైతులు కన్నీరుము న్నీరవుతున్నారు. ఎడతెరిపి లేకుండా గత ఐదు రోజులుగా కురిసిన వర్షాలు కారణంగా ప్రధానంగా బొప్పాయి తోటలు చిన్న మొక్క దశలోనే నీటి నిల్వల కారణంగా రంగు మారి యువకు పట్టి పంట నాశనం అయ్యే పరిస్థితి నెలకొంది అంటూ బొప్పాయి రైతులు వాపోతున్నారు.

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి మండలం మొత్తం సుమారు ఇరవై ఎకరాల్లో బొప్పాయి పంటను సాగు చేస్తుండగా ఎక్కువ శాతం పేరిపి, అలజంగి, కెల్లపాలెం తదితర ప్రాంతాల్లో ఈ ఏడాది రైతులు ఈ పంటను వేశారు. వర్షాలకు ముందు నాటిన బొప్పాయి మొక్కలు సుమారు రెండు నెలల కాల వ్యవధిలోనే ఆకస్మిక వర్షాలు కారణంగా నీరు ఎక్కువ అవడంతో ఇవకు చేరి మొక్క దశలోనే పాడైపోతుందని రైతులు వాపోతున్నారు. వంగ తోటలు కూడా నీటి నిల్వ వల్ల ఇవక చేరి రంగు మారి పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు చెబుతున్నారు. మండలంలో సుమారుగా 40 నుండి 50 ఎకరాల వరకు కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా కూరగాయల పండించే పొలాలలోని అసాధారణ నీరు చేరడంతో పంట మొత్తం నీటిలో నానిపోయింది. దీని కారణంగా పంటలు మొత్తం ఇవక పట్టే ప్రమాదం ఉందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆకు కూరలు క్యాబేజీ, టమోటాతో పాటు ఇతర పంటలకు వర్షాలు కారణంగా తెగులు సోకే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. వాణిజ్య వ్యవసాయ సాగుతో లాభాలను సాధించాలనుకున్న రైతులకు అకాల వర్షాలు తీవ్ర నష్టాలకు గురిచేసిందంటూ పలువు రైతులు వాపోతున్నారు. ఉద్యానవన పంటల కారణంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం గుర్తించి తగిన సహకారం అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

50 ఎకరాల్లో నీటమునిగిన మొక్కజొన్న

డెంకాడ: మొక్కజొన్న నుంచి నీటిని వేరు చేస్తున్న రైతు

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ పరిధిలోని 12 గ్రామాలకు సంబంధించిన మొక్కజొన్న సుమారు 50 ఎకరాలు నీటి మునిగింది. పంట వేసి సుమారు రెండు మూడు వారాలు కావడం వెంటనే వర్షాలు రావడంతో పంట నీటమునిగి నష్టం వాటిల్లింది. మొక్కదశలోనే నీట మునగడం వల్ల మొక్క మరి బతికే అవకాశం లేదని, నీరు కూడా బయటకు పోవడానికి మార్గం లేదు కాబట్టి మొక్కలు కుళ్లిపోయి చనిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

రైతులకు పలు సూచనలు చేశాం

ఇప్పటికే రైతులు వారీగా తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు నీటి నిల్వలు ఉన్నచోట వాటిని తొలగించాలని రైతులకు పలు సూచనలు చేశాం. అవసరమైన ఎరువుల వాడకంపైన రైతులకు సూచనలు చేస్తున్నాం. మండలంలో సుమారు 70 నుండి 80 ఎకరాలు అరటిపంట ఉన్నప్పటికీ వర్షాలకు గాలి తోడు కాకపోవడం వల్ల ఎటువంటి నష్టం వాటిల్లలేదు.

సిహెచ్ చంద్రశేఖరరావు, ఉద్యానవన శాఖ అధికారి, చీపురుపల్లి

పెసర, మినుము పంటలకు నష్టం

వేపాడ: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పెసర, మినుము వంటి అపరాలు పంటలు నీటమునిగాయి. గత వారం రోజులుగా వర్షం కురుస్తుండటంతో పంటలన్నీ నీటిలోనే ఉండిపోయి రైతులు నష్టపోయారు. వర్షపు నీరు మడిలో నిల్వ ఉండిపోవడంతో ఏపుగా ఎదిగిన మొక్కలు చివికిపోయి, కుళ్ళిపోతున్నాయి. పది రోజులు క్రితం వరకూ ఈ ఏడాది అపరాలు పంటల వల్ల లాభం వస్తుందని ఆశించిన రైతు ఆశలపై తుపాను నీళ్లు జల్లింది. దీంతో ఈ ఆశలను కూడా రైతులు వదులుకున్నారు.

వరి పంటకు మొలకలు

శృంగవరపుకోట: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలోని ముసిడిపల్లి పంచాయతీలో తడిచిన వరి పంటకు మొలక వచ్చింది. దీంతో దెబ్బతిన్న పంటను అధికారులు పరిశీలన చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని స్థానిక రైతులు కోరతున్నారు. పంట నష్టపరిహారం ఇప్పించాలని చెబుతున్నారు.

ఎస్‌కోట: మొలక వచ్చిన వరి కంకులు

అడుగుకో గుంత.. ప్రయాణం చింత..

మెరకముడిదాం: దెబ్బ తిన్న గర్భాం రహదారి

ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు కూడా ఛిద్రమయ్యాయి. ఏ రోడ్డు చూసినా అడుగుకో గొంత.. గజానికో గొయ్యి అన్న చందంగా కనిపిస్తున్నాయి. కొన్ని రోడ్లు చెరువులను తలపిస్తున్నయనడంలో అతిశయోక్తి లేదు. ఈ రోడ్లు గుండా ప్రయాణించేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల రోడ్లకు పడిన గొంతల్లో నీరు చేరడంతో లోతు కనిపించక అందులో వాహనాలు దిగి ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతులకు గురైన రోడ్లను బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– చీపురుపల్లి, వేపాడ, మెరకముడిదాం, గజపతినగరం, ప్రజాశక్తి

గజపతినగరం: చెరువును తలపిస్తున్న గజపతినగరం మెంటాడ రోడ్డు

చీపురుపల్లి: బురదగా పేరిపి నుంచి కెల్లపాలెం వెళ్లే రహదారి

వేపాడ: గోతులమయమైన ఆకులసీతంపేట రోడ్డు

భోగాపురం: నీటిలో ప్రయాణిస్తున్న వాహనాలు

వర్షపు నీటితో ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి- భోగాపురం

రోడ్డుపై వర్షపు నీరు ఎటు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రాజాపులోవ వద్ద గత మూడు రోజుల నుంచి వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్లే రహదారిలో ఈ పరిస్థితి ఉంది. తేలిక పాటి వర్షం పడితే చాలు ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- గజపతినగరం

ఐక్యపోరాటాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పురిటిపెంట పాల్తేరు కల్యాణ మండపం ఆవరణలో తుపాకుల రాము అధ్యక్షతన ఆదివారం ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డప్పు కళాకారులు, చర్మ కళాకారులు ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. దళితులకు పాలక ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలకు ఐక్యంగా పోరాడితే తప్ప వేరే మార్గం లేదన్నారు. దళితులు, మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, దాడులు దౌర్జన్యాలపై సంఘటితంగా ఎదుర్కోవాలని అన్నారు. కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి సతవిధాల ప్రయత్నం చేస్తుందని, రాజ్యాంగాన్ని స్ఫూర్తిని రాజ్యాంగ హక్కుల్ని హరించేసే విధంగా పాలన సాగిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్షం, అధికారపక్షం వాళ్ళు బిజెపికి అండగా నిలబడడం మన రాష్ట్రానికి దురదృష్టకరమని అన్నారు. కేరళ తరహాలో వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు కానీ ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా వేయలేదని గుర్తు చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని 200 రోజులు పని 600 రూపాయలు కూలి డిమాండ్‌ను పక్కన పెడుతున్నాయని చెప్పారు. వంద రోజులు పని లక్ష్యాన్ని చేరడానికి 50శాతం లోపే పని జరుగుతుందని ఇది వ్యవసాయ కూలీలు పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చని అన్నారు. డప్పు, చర్మ కళాకారులకు ఉచితంగా డబ్బులు, గజ్జలు, బట్టలు పనిముట్లు ఇవ్వకుండా తాత్సారం జరుగుతుందని, పెన్షన్ పెంపుదలకు దూరమవుతున్నారని చెప్పారు. రూ. 6వేలు పింఛను పెంచాలని డిమాండ్‌ను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. శ్మశాన స్థలాలకి కూడా దళితులు నోచుకోలేని స్థితికి దిగజార్చారన్నారు. అసైన్డ్ భూములను పెద్దల చేతుల్లో పెడుతున్నారు తప్ప తిరిగి పేదలకు ఇవ్వడానికి సిద్ధం చేయడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు పెత్తందారులకు పేదల భూములు దకల పరచడానికి జీవోలు తెస్తున్నారని చెప్పారు. పై సమస్యల పరిష్కారానికి పోరాడి ప్రభుత్వాలు మెడల వంచాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు రాములు, గోవింద, రాంబాబు, చింతల దేవుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు

సమావేశంలో మాట్లాడుతున్న జి. శ్రీనివాస్

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు, కాంగ్రెస్ నాయకులు కనకల పద్మనాభం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఇందిరా కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులు, వెనుక బడిన వర్గాల ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. రాజ్యసభలో 75వ రాజ్యాంగ వార్షికోత్సవ సభలో అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు వల్ల కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బ తిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ వెంటనే మంత్రి వర్గం నుంచి అమిత్ షాను తొలిగించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుర్ల అప్పలనరసయ్య, ఎం. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి: డిబిఎస్‌యు

కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ నాయకులు రాయి ఈశ్వర రావు డిమాండ్ చేశారు. సారిపల్లిలో డిబిఎస్‌యు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యుగేశ్వరరావు, రామారావు, రామేశ్వర రావు, చంద్రశేఖర, వరలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని గాంధీనగర్ ఎస్‌సి కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా ఎగతాళిగా వ్యంగ్యంగా అవమానపరుస్తూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగపు హక్కులు గూర్చి వాడి వేడిగా చర్చలు జరుగుతున్న సందర్భంలో అమిత్‌షా పార్లమెంటులో అనేక మంది మంత్రులు మధ్య అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడటం బరితెగింపేనన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్, సిపిఎం నాయకులు వంక ఆదినారాయణ, పి.వి రమణ, బండ సూరిబాబు, సబ్బవరం పెద్దాపురం, టిడిపి మాజీ ఎంపిటిసి గాడి సోనీ, పావడ మని, పావడ సునీత తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యేలు, పౌండేషన్ ప్రతినిధులు

ఉప్పలపాటి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కొత్తవలస

డాక్టర్ ఉప్పలపాటి పౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్‌పి శ్రీభరత్ అన్నారు. మంగళపాలెంలోని ఉప్పలపాటి వెంకటపతిరాజు సహకారంతో రూ.15 కోట్లతో శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ నిర్మించిన కేన్సర్ ఆసుపత్రిని ఎమ్‌పి, ఎమ్మెల్యేలు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్‌పి భరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ జగదీశ్ బాబు సేవలను కొనియాడారు. జామి మండలం అలమండ గ్రామానికి చెందిన ఉప్పలపాటి ఫౌండేషన్ అధినేత ఉప్పలపాటి వెంకటపతిరాజు 40 ఏళ్ళుగా అమెరికాలో స్థిరపడి సొంత ప్రాంతానికి సేవలందించాలన్న దృక్పథంతో ఆసుపత్రి నిర్మాణానికి ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ఇక్కడికి వచ్చే రోగులకు చికిత్స, వసతి ఉచితమని, మందులు పరీక్షలకు మాత్రం నామమాత్రపు రుసుము తీసుకుంటామని జగదీష్ బాబు తెలిపారు. ఉప్పలపాటి వెంకటపతిరాజు సహకారంతో తన భార్య ఉప్పలపాటి విజయశ్రీ జ్ఞాపకార్థంగా ఆమె పేరిట ఉప్పలపాటి విజయశ్రీ మెమోరియల్ 100 పడకల కేన్సర్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి, టిడిపి అధికార ప్రతినిధి గొంప కృష్ణ, లోక్‌సత్తా నాయకులు బీశెట్టి బాబ్జి, టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, మండల తెలుగు యువత నాయకులు కోరుబిల్లి ఉపేంద్ర, కూటమి నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జూదగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ముగ్గురు జూదగాళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు. ఆదివారం వల్లూరు గ్రామం శివారు ఏటి వద్ద పేకాడుతున్న ముగ్గురుని పట్టుకుని అరెస్టు చేశామని వారి నుంచి రూ.2150 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రోడ్డు మధ్యలో స్తంభాన్ని ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నగరంలోని వై-జంక్షన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ కథనం ప్రకారం...నగరంలోని విటి అగ్రహారానికి చెందిన శ్రీపతి మురళీకృష్ణ (60) ఆదివారం ఉదయం బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి, తిరిగి వస్తున్నాడు. వై-జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఆయన్ను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల పెద్దమ్మాయికి వివాహమైంది. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. స్థానిక రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి డౌన్లో అభయ ఆసుపత్రిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అధునాతన పరికరాలు, సౌకర్యాలతో ఆసుపత్రి ఏర్పాటు చేయడం రోగులకు ఎంతో ఉపయోగం అన్నారు. ఆసుపత్రి ఎండి డాక్టర్ బూరి అనిల్ కుమార్ మాట్లాడుతూ 24గంటలు ఐసియు అందుబాటులో ఉంచి జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, అర్థోపిడ్ వైద్యులు అందుబాటులో ఉండి వైద్యులు సేవలు అందిసున్నారన్నారు. అధునాతన ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. అన్ని వైద్య సేవలు ఒకేచోట అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైద్యులు ఆర్నిపల్లి గోపీనాథ్, ద్వారపురెడ్డి రామ్మోహన్, చుక్క సూర్యనారాయణ, చుక్క అభిజ్ఞ, గేదెల శశిభూషణరావు, వివిధ ప్రాంతాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

జోనల్ కోఆర్డినేటర్‌గా గోపాలకృష్ణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జాతీయ మానవ హక్కుల ఫోరం జోనల్ కోఆర్డినేటర్‌గా ఇప్పిలి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం చైర్మన్ టిఎస్ రామచంద్రనాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పదవితో మరింత బాధ్యత పెంచిందన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆయన్ను అభినందించారు.

రహదారుల మరమ్మతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో రహదారుల మరమ్మతులు శరవేగంగా సాగుతున్నాయి. రహదారుల పాక్షిక మరమతులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఎఇ స్థాయి సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రతీ పని వద్ద క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కమిషనర్ నల్లనయ్య ఇచ్చిన ఆదేశాలతో సిబ్బంది స్వీయ పర్యవేక్షణ చేస్తున్నారు.